క్లుప్తంగా

ఎస్సై బాధ్యతల స్వీకరణ


ఎస్సై వీరేంద్రబాబు

ఇందుకూరుపేట : మండల నూతన ఎస్సైగా జి.వీరేంద్రబాబు మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు నవాబుపేట పోలీస్‌స్టేషన్ నుంచి ఆయన ఇందుకూరుపేటకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎం.రాజ్‌కుమార్ వీఆర్ బదిలీపై వెళ్లారు. నూతన ఎస్సైకు సిబ్బంది అభినందనలు తెలిపారు.

జనసేన నేతలపై కేసు నమోదు

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని మినగల్లు ఇసుక రీచ్ వద్ద వాహనాలను అడ్డుకోవడంతో పాటు రీచ్ సూపర్‌వైజర్‌తో దురుసుగా ప్రవర్తించినందుకు జనసేన నాయకులైన కిశోర్, సునీల్‌తో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వీరప్రతాప్ బుధవారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని మినగల్లులో ఉన్న రీచ్‌కు ఇసుకను తీసుకొస్తున్న వాహనాలను జనసేన నాయకులు అడ్డుకున్నారు. దీనిపై రీచ్ సూపర్‌వైజర్ ప్రశ్నించగా అతనితో దురుసుగా ప్రవర్తించారు. ఈ ఘటనపై సూపర్‌వైజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

ఉపాధి కల్పనే లక్ష్యం

• డ్వామా ఏపీడీ సుజాతమ్మ


ఉపాధి పనులపై సమీక్షిస్తున్న సుజాతమ్మ

మనుబోలు : ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలో రోజుకు లక్షా 20 వేల మందికి పని కల్పించడమే లక్ష్యమని డ్వామా అడిషనల్ పీడీ సుజాతమ్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి పథకం టీఏలు, ఎఫ్‌ఏలతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న లేఅవుట్‌లలో జిల్లా వ్యాప్తంగా 2,200 ఇంకుడు గుంతలు నిర్మిస్తామన్నారు. వీటిలో మొదటి విడతలో 825 మంజూరైందని తెలిపారు. రూ.260 కూలీ అందేలా కృషి చేస్తామన్నారు. సమావేశంలో ఏపీడీ శ్రీహరిరెడ్డి, ఏపీఓ రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

కళా ప్రదర్శనతో రైతు వికాసం

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : రైతులకు అందజేసే రుణాలు, పథకాలపై కళా ప్రదర్శన ద్వారా చైతన్య పరిచే కార్యక్రమం డీసీసీబీ చేపట్టింది. జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) రామూర్తినగర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో బుధవారం కోడూరుపాడు గ్రామంలో కోదండరామస్వామి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో పలు పథకాలు, రుణాలకు సంబంధించిన విషయాలపై కళాకారులు తమదైన శైలిలో ప్రచారం చేశారు. బ్యాంక్ నుంచి రుణాలు పొందడం, తిరిగి వాటిని సులభతరంగా చెల్లించడం, రైతుల కోసం ప్రవేశపెట్టిన ప్రత్యేక పథకాలపై ప్రదర్శన రూపంలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ రామ్మూర్తినగర్ బ్రాంచ్ సూపర్‌వైజర్ బాబు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్‌పర్సన్ వెంకటేశ్వర్లు, సీఈఓ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి


బలరామయ్య నాయుడును సత్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం) : నగరంలోని పురమందిరంలో పాటలు, నృత్య పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సంగీత విభావరి బుధవారం ఆద్యంతం అలరించాయి. ఏవీకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేతా అంకులు మెమోరియల్ ట్రస్టు పర్యవేక్షణలో జరిగిన విభావరిలో పలువురు తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కార్యక్రమ పర్యవేక్షకుడు కేతా సుబ్బారావు మాట్లాడుతూ కళారంగానికి, కళాకారులకు తోడ్పాటు అందించాలన్న ఆశయంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు పాటలు, నృత్య పోటీలు నిర్వహించామన్నారు. విజేతలుగా నిలిచిన వారికి ప్రోత్సాహకంగా నగదు, జ్ఞాపికలను అందజేశామన్నారు. ఈ సందర్భంగా తమ వంతుగా సాహిత్య, సామాజిక సేవలందిస్తున్న పద్య కళాపరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్, ప్రపంచ తెలుగు సమాఖ్య నెల్లూరు ప్రాంతీయ సమన్వయకర్త నలుబోలు బలరామయ్య నాయుడులను ఘనంగా సత్కరించామన్నారు. అనంతరం శ్రీబాలాజీ ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో జరిగిన మ్యూజికల్ నైట్ అలరించింది. ప్రవీణ్‌కుమార్ శిష్య బృందం ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నిర్వాహకులు ఎ.జయప్రకాష్, షేక్.రియాజ్‌బాషా, పి.ప్రదీప్, ఎన్వీ రమణయ్య, ఎస్.సత్యం, ఎం.మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటి వద్ద విశేషాదరణ


వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

• కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం : అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు అందడంతో ప్రతి ఇంటి వద్ద తనకు విశేషాదరణ లభిస్తోందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని 2, 18వ వార్డుల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఆయన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలకు మించి సంక్షేమ పథకాలను అమలు చేశామని గుర్తుచేశారు. ఈ నాలుగేళ్లలో దాదాపు రూ.2 లక్షల కోట్లతో అర్హులకు సంక్షేమ పథకాలను అందించినట్లు తెలిపారు. ముఖ్యంగా సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా గ్రామ స్వరాజ్యం సాకారమైందన్నారు. గతంలో సామాజిక పింఛన్లు తీసుకోవాలంటే మండల కేంద్రానికి వచ్చి ప్రభుత్వ కార్యాలయాల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చేదని, ప్రస్తుతం ఇంటి వద్దకే పింఛన్లను అందిస్తున్నట్లు చెప్పారు.

వైఎస్సార్‌సీపీలో వంద మంది చేరిక

బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని రెండో వార్డులో సుమారు వంద మంది టీడీపీ కార్యకర్తలు ఎమ్మెల్యే ప్రసన్న సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలో పాతవారికి, కొత్తవారికి సముచిత స్థానం ఉంటుందన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్‌పర్సన్ కోటంరెడ్డి లలితారెడ్డి, వైస్ చైర్మన్ షాహుల్, కౌన్సిలర్లు మోర్ల జయంతి, శ్రీదేవి, యానాదిరెడ్డి, మల్లారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కన్వీనర్లు చెర్లో సతీష్‌రెడ్డి, టంగుటూరు మల్లికార్జున్‌రెడ్డి, కోవూరు మండల కన్వీనర్ నలుబోలు సుబ్బారెడ్డి, పార్టీ నేతలు ఇప్పగుంట విజయభాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, భరత్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి


మాట్లాడుతున్న సూపర్‌వైజర్ పద్మజ

పొదలకూరు : బాల్య వివాహాలను అరికట్టేందుకు గ్రామస్తులంతా సహకరించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మజ పేర్కొన్నారు. మండలంలోని నావూరుపల్లి ఎస్సీ కాలనీలో బాల్య వివాహాలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలకు 18 ఏళ్లు నిండిన తర్వాతనే వివాహం చేయాల్సిందిగా సూచించారు. 18 ఏళ్లలోపు పెళ్లి చేస్తే చట్టరీత్యా నేరమవుతుందన్నారు. బాల్యవివాహాలను ఎవరైనా జరిపిస్తే వెంటనే తమకు సమాచారం అందజేయాల్సిందిగా పేర్కొన్నారు. బాల్యవివాహాల వల్ల పుట్టిన బిడ్డలు అనారోగ్యానికి గురవుతారని, గర్భస్రావాలు కూడా అధికంగా ఉంటాయని తెలిపారు. బాల్యవివాహాలు జరిపించే వారిపై పోలీసులు కేసు నమోదు చేస్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త పెంచలమ్మ, ఆయా ఆదెమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేకావసరాల పిల్లలపై శ్రద్ధ


శిక్షణ తరగతులకు హాజరైన ఉపాధ్యాయులు

ముత్తుకూరు : సీబీఎస్‌ఈకి అనుబంధంగా ఉన్న పాఠశాలల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని రిసోర్స్ పర్సన్లు రూపారాణి, చంద్రజ్యోతి అన్నారు. గోపాలపురంలోని అదానీ వరల్డ్ స్కూల్‌లో బుధవారం జరిగిన ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమంలో వారు ప్రసంగించారు. ప్రత్యేక అవసరాల పిల్లలకు సీబీఎస్‌ఈ బోర్డు ఎటువంటి విద్యావిధానాలు అవలంబించాలో చర్చించారు. పిల్లల సమస్యలు పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన కమిటీల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ప్రిన్సిపల్ సత్యనారాయణ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం పూర్తయిన తర్వాత చర్చా కార్యక్రమం జరిపారు.

దేశభక్తులను స్మరించుకోవాలి


మాట్లాడుతున్న ఉషారాణి

ముత్తుకూరు : విద్యార్థులు దేశభక్తులను మరిచిపోకుండా స్మరించుకోవాలని జిల్లా సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఉషారాణి అన్నారు. నా భూమి–నాదేశం కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక విద్యావనరుల కేంద్రంలో ప్రముఖ దేశ భక్తుల త్యాగాలను, సేవలను గుర్తు చేసుకొంటూ వారికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించాలన్నారు. దేశ సమైక్యత, దేశ పురోగతిని వివరించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సుధీర్‌బాబు, స్థానిక జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం శ్రీనివాసులురెడ్డి, స్థానిక యూపీస్కూల్ హెచ్‌ఎం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విజయోత్సవ సంబరాలు


ముత్తుకూరు : విద్యార్థుల మానవహారం


ముత్తుకూరు : మామిడిపూడిలో త్రివర్ణ పతాకంతో ప్రదర్శన

ముత్తుకూరు : చంద్రయాన్–3 విజయవంతంపై బుధవారం సాయంత్రం మండల పరిధిలో సంబరాలు నెలకొన్నాయి. ఇందులో భాగంగా మామిడిపూడిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు విద్యార్థులతో కలిసి మానవహారం చేశారు. త్రివర్ణ పతాకాలతో ప్రదర్శన నిర్వహించారు. ఇస్రో శాస్త్రవేత్తల కృషిని కీర్తించారు.

బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీ పరిధిలోని రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో చంద్రయాన్–3 విజయోత్సవ సంబరాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రిసోర్స్‌పర్సన్ గండికోట సుధీర్‌కుమార్ మాట్లాడుతూ దాదాపు నాలుగేళ్లుగా శాస్త్రవేత్తలు పడిన కష్టానికి ఫలితం దక్కిందన్నారు. అనంతరం విద్యార్థులు బెలూన్‌లపై చంద్రయాన్–3 అని రాసుకుని కేరింతలు కొట్టారు.


బుచ్చిరెడ్డిపాళెం : విజయోత్సవ సంబరాల్లో విద్యార్థులు

మంచి అధికారిని కోల్పోవడం బాధాకరం

• ఈఓపీఆర్డీ నాగరాజు సంతాపసభలో అధికారుల వెల్లడి


ఈఓపీఆర్డీ నాగరాజుకు నివాళులర్పిస్తున్న నాయకులు, అధికారులు

కొడవలూరు : మంచి అధికారిగా పేరొందిన ఈఓపీఆర్డీ వి.నాగరాజును కోల్పోవడం బాధాకరమని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావుతో పాటు తోటి అధికారులు ఆవేదన వ్యక్తం చేశారు. మండల ఈఓపీఆర్డీగా పనిచేస్తూ కాశీ ఘాట్‌లో మృతిచెందిన నాగరాజుకు స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం సాయంత్రం సంతాప సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చలపతిరావు మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో అన్ని సచివాలయాలకు నాగరాజు అందించిన సహకారం మరువలేనిదన్నారు. నాగరాజు కుమారులు హితేష్, తేజేష్ మాట్లాడుతూ మా తండ్రి మంచి వ్యక్తిత్వాన్ని మాకు వారసత్వంగా ఇచ్చారని, ఆయన పేరు ప్రతిష్టలు నిలబడేలా నడుచుకుంటామన్నారు. తమ తండ్రి నదిలో కనిపించకుండా పోయిన సమయంలో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డితో పాటు నాయకులు, అధికారులు అందించిన సహకారం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ, తహసీల్దార్‌లు పి.సుబ్రహ్మణ్యం, ఈ.రమాదేవి, ఎంఈఓ జి.వసంతకుమారి, ఎంపీపీ గాలి జ్యోతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్, విజయా డెయిరీ డైరెక్టర్ ఇసనాక సునీల్‌రెడ్డి, సర్పంచ్‌లు మారంరెడ్డి రంగారెడ్డి, బండి పెంచలయ్య, పార్టీ నేత మనోహర్‌బాబు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం


పొదలకూరు : స్థానిక ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ) కోర్సుల్లో 2023–24 విద్యాసంవత్సరానికి మూడో విడత దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ బి.మురళీధర్ బుధవారం పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా ఈనెల 27వతేదీలోగా అభ్యర్థులు తమ దరఖాస్తులను సమర్పించాల్సిందిగా సూచించారు. సూయింగ్ టెక్నాలజీ, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్, హార్టికల్చర్ కోర్సుల్లో సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఈనెల 28వ తేదీన సాయంత్రం 5 గంటల్లోగా తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకోవాల్సి ఉంటుందన్నారు. పొదలకూరుకు సమీపంలోని చిట్టేపల్లి వద్ద నూతన ఐటీఐ కళాశాల భవనంలో ఈనెల 30వ తేదీ ఉదయం 10 గంటలకు మూడోవిడత కౌన్సెలింగ్ నిర్వహిస్తామని చెప్పారు. కోర్సుల వివరాలకు సంబంధించి సూయింగ్ టెక్నాలజీకు 81850 88996, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ 89851 19940, డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్ 94948 31200, హార్టికల్చర్ 88868 86144 నంబర్లకు ఫోన్ చేయాల్సిందిగా సూచించారు.

విద్యతోనే ఉజ్వల భవిత


ఉపకరణాలు అందజేస్తున్న ప్రిన్సిపల్

బుచ్చిరెడ్డిపాళెం: విద్యతోనే ఉజ్వల భవిత సాధ్యమని దామరమడుగు కొండా కోటారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ అట్ల శ్రీనివాసులు అన్నారు. స్థానిక జూనియర్ కళాశాలలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా నెల్లూరుకు చెందిన కేశవ స్మారక సమితి వారు విద్యార్థులకు బుధవారం విద్యా ఉపకరణాలను అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ విద్యలో ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సమితి కోశాధికారి కిలారి నాగూరుస్వామి అధ్యాపకులు పాల్గొన్నారు.

పశు వైద్యశాల తనిఖీ


డీడీ నాగమణిని సత్కరిస్తున్న సిబ్బంది

ఇందుకూరుపేట : ఇందుకూరుపేటలోని పశు వైద్యశాలను పశు సంవర్ధకశాఖ డీడీ నాగమణి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇక్కడి సిబ్బంది పనితీరు చాలా బాగుందని ప్రశంసించారు. పాడి రైతులకు అందుబాటులో ఉంటూ మరన్ని సేవలు అందించాలన్నారు. ఈ సందర్భంగా పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం డీడీ నాగమణిని సిబ్బంది సత్కరించారు.

కాలువ నిర్మాణానికి శంకుస్థాపన



బుచ్చిరెడ్డిపాళెం : నగర పంచాయతీ పరిధిలోని 16వ వార్డు అన్నానగర్‌లో సైడు కాలువ నిర్మాణానికి స్థానిక కౌన్సిలర్ బిట్రగుంట ప్రమీలమ్మ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి సహకారంతో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. రూ.4.40 లక్షలతో నిర్మిస్తున్న కాలువ పనులను త్వరలో పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆదర్శప్రాయులు ఆంధ్రకేసరి


తోటపల్లిగూడూరు : ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ స్వర్ణలత

తోటపల్లిగూడూరు : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ఆదర్శప్రాయులని మండల పరిషత్ అధ్యక్షురాలు ఉప్పల స్వర్ణలత పేర్కొన్నారు. తోటపల్లిగూడూరులోని మండల పరిషత్ కార్యాలయంలో ప్రకాశం పంతులు జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎంపీపీ స్వర్ణలత పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దేశ చరిత్రలోనే మహోన్నత వ్యక్తుల్లో టంగుటూరు ఒకరన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హేమలత, ఈఓపీఆర్డీ నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా..

మనుబోలు : ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను మనుబోలులోని ప్రభుత్వ కార్యాలయాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది, రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శివకృష్ణయ్య, సిబ్బంది ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శివకృష్ణయ్య మాట్లాడుతూ ప్రకాశం పంతులు ధైర్య సాహసాలు, పోరాట స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీఓ కార్యాలయ ఏఓ రవికుమార్, తహసీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్ అమీర్‌బాషా, ఆర్‌ఐ శ్రీకాంత్, వీఆర్వో నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మనుబోలు : ఆంధ్రకేసరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

ఎన్‌ఎస్సార్ ట్రస్ట్ ద్వారా చేయూత


బాండ్లను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం : నగర పంచాయతీ పరిధిలోని పలు వార్డుల్లో ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న కుటుంబాలకు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తన తండ్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి ట్రస్ట్ ద్వారా బుధవారం చేయూత అందించారు. ఇందులో భాగంగా ముత్తుకూరు ధనుష్, నాపా వెంకట నాగకార్తీక్, పిట్టు తోహిల్‌కుమార్, యస్వంత్‌కుమార్‌లకు రూ.20 వేల చొప్పున ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసి వారి కుటుంబసభ్యులకు బాండ్లను అందజేశారు. అలాగే మానసిక సమస్యతో ఇబ్బంది పడుతున్న తోట సంధ్యకు రూ.10 వేలను అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు చీర్ల ప్రసాద్, అనంతమ్మ, నాగరాజు, సత్యనారాయణ, నాయకులు అల్లాభక్షు, విల్సన్, ప్రవల్లిక పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే ధ్యేయం

• మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయకుమార్


యాత్ర చేపట్టిన విజయకుమార్ బృందం

ముత్తుకూరు : దేశంలో పేదరిక నిర్మూలనే తమ ధ్యేయమని మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయకుమార్ అన్నారు. ముత్తుకూరులో బుధవారం ఆయన ఐక్యత విజయపథం యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో పేదలకు గూడు కరువైందని, 77 ఏళ్ల స్వాతంత్ర్య భారతావనిలో సాధించింది ఏమీ లేదన్నారు. మూడు వారాల పాటు జరిగిన తన యాత్రలో వేల సంఖ్యలో పేదలు అర్జీలు సమర్పించారన్నారు. పేదరికం నుంచి విముక్తి కోసం చేపట్టిన యాత్రలో అన్ని వర్గాల వారు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



కోవూరు(విడవలూరు): మండలంలోని ఊటుకూరు గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న శంకర్‌నగర్ కాలనీలో టీటీడీ సహకారంతో నూతన రామాలయ నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ రామిరెడ్డి విజయ్‌భానురెడ్డి పర్యవేక్షణలో వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా భూమిపూజ చేపట్టారు. ఈ సందర్భంగా భానురెడ్డి మాట్లాడుతూ సుమారు రూ.10 లక్షలతో ఆలయాన్ని నిర్మిస్తున్నారని చెప్పారు. ఈ నిధుల మంజూరుకు సహకరించిన ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువజన విభాగ రాష్ట్ర కార్యదర్శి బెజవాడ వంశీరెడ్డి, స్థానిక నేతలు పాల్గొన్నారు.

కేసుల పెండెన్సీని తగ్గించాలి

• ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న పోలీస్ అధికారులు

నెల్లూరు(క్రైమ్): ఎర్రచందనం కేసుల పెండెన్సీని తగ్గించి నిందితులకు శిక్షలు పడేలా చేయాలని ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎర్రచందనం కేసుల పురోగతిపై ఆయన బుధవారం నెల్లూరులోని తన చాంబర్ నుంచి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. దీర్ఘకాలికంగా కేసుల పెండెన్సీకి గల కారణాలను తెలుసుకుని వాటి పరిష్కారానికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎర్రచందనం అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో కట్టడి చేయాలన్నారు. కేసుల నమోదు, నిందితుల అరెస్టులతో సరిపెట్టుకోకుండా మూలాలా ఏరివేత దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. అనేక కేసుల్లో దర్యాప్తు అంతంత మాత్రంగానే ఉందని, ఫారెస్ట్ అధికారుల సమన్వయంతో దర్యాప్తును పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసి నిందితులకు శిక్షలు పడేలా చేయాలన్నారు. కేసుల పెండెన్సీని ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదన్నారు. దిగువ కోర్టుల్లో ఉన్న కేసులను ఎర్రచందనం కోర్టుకు బదిలీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కూలీల నుంచి అంతర్జాతీయ స్మగ్లర్ల వరకు శిక్షను పడేలా చేసినప్పుడే ఎర్రచందనం అక్రమరవాణా నియంత్రణ సాధ్యమవుతుందని, ఆ దిశగా పోలీసు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కాన్ఫరెన్స్‌లో ఏఎస్పీ ప్రసాద్, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

నేడు వెంకయ్యస్వామి ఆరాధనోత్సవం

నెల్లూరు(బారకాసు) : నగరంలోని ఏసీనగర్‌లో బీసీ కేసీ కల్యాణ మండపం పక్కన ఉన్న భగవాన్ వెంకయ్యస్వామి దేవస్థానంలో నేడు 16వ ఆరాధన మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు మురళీకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవస్థాన సేవా యూత్ ఆధ్వర్యంలో జరిగే ఆరాధనోత్సవంలో ఉదయం 4 గంటలకు ధునిపూజ, 5 గంటలకు సుప్రభాతం, అభిషేకం, 6 గంటలకు హారతి, ప్రసాద వితరణ తరువాత నిత్య పూజలు ఉంటాయన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. సాయంత్రం 4 గంటలకు పూజా కార్యక్రమం, రాత్రి 7కు తీర్థప్రసాద వితరణ, రాత్రి 9 గంటలకు నగరోత్సవం జరుగుతుందని వివరించారు. 24న ఉదయం 6 నుంచి 25న ఉదయం 6 వరకు అఖండ సంకీర్తన భజన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భక్తులందరూ పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.